నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శనివారం 29 మార్చి 2025 YADADRI BHUVANAGIRI



ఆలేరు టౌన్ : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

# రైతులను అణచివేస్తే తిరుగుబాటు తప్పదు

- మోదీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసనలు

నకిరేకల్/సూర్యాపేట టౌన్/వేములపల్లి/మాడ్గులపల్లి/ఆలేరు టౌన్, మార్చి 28 : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. పంజాబ్, హర్యానాలో రైతుల నిరసనపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎమ్) ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆందోళనలు నిర్వహించారు. నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సూర్యాపేట కొత్తబస్టాండ్ వద్ద, ఆలేరు పట్టణంలో రైల్వే గేటు వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వేములపల్లి, మాడ్గులపల్లిలో నిరసనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


భువనగిరి ఏరియా దవాఖానలో యూడీ ఐడీ కార్డును అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

# దివ్యాంగులు యూడీఐడీ కార్డు తీసుకోవాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, మార్చి 28 : యూనిక్ డిజబిలిటీ ఐడీ కార్డ్‌ను జిల్లాలోని ప్రతి దివ్యాంగులు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భారత, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు భువనగిరి పట్టణంలోని ఏరియా దవాఖానలో ఏర్పాటు చేసిన యూడీ ఐడీ కార్డుల జారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 19,250 మంది సదరం సర్టిఫికెట్‌లు కలిగిన దివ్యాంగులు ఉన్నారని, వారు యూడీ ఐడీ కార్డులు పొందారని, కొత్తగా సదరం సర్టిఫికెట్ అర్హత పొందిన వారు స్లాట్ బుక్ చేసుకోవడానికి ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. యూడీ ఐడీ కార్డు భారత, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జారీ చేస్తున్నారని, ఈ కార్డు పొందిన వారికి దేశంలో అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, పెన్షన్, రోడ్డు రవాణా, రైతు రవాణాలో పాసులు పొందవచ్చునని, బ్యాంకులు ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందడానికి అర్హతలు ఉంటుందని చెప్పారు. శుక్రవారం స్లాట్ బుక్ చేసుకున్న 5 మంది దివ్యాంగులకు డాక్టర్లు నిర్ధారణ చేసి యూడీ ఐడీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారని, వారికి వికలాంగ శాతం అనుసరించి యూడీ ఐడీ కార్డులు పోస్టుద్వారా పంపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రాజారాం, ఆర్ఎంఓ శ్రీనివాస్, డాక్టర్లు చిన్న నాయక్, కిరణ్, పంజా నాయక్, శంకర్, రాజలింగం, రమేశ్, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.


నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నేతలు

# హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

రామగిరి, మార్చి 28 : హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల చట్టం చేయాలని, అన్ని రకాల వడ్లను మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయోత్పత్తులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు రైతాంగ ఆత్మస్థైర్యాన్ని కుంగతీసే విధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు వ్యవసాయ ఉత్పత్తులకు స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేస్తామన్న మోదీ మాటలు నీటమూటలయ్యాయని ఎద్దేవా చేశారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల గురించి కేంద్రం మాట్లాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారో నిర్దిష్టమైన కాలపరిమితి ప్రకటించాలని అన్నారు. మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే అమలు చేయాలని తెలిపారు. ధాన్యం కేంద్రాలను సత్వరమే ప్రారంభించాని, డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ శ్రేణులు పాలడుగు నాగార్జున, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం, నారి ఐలయ్య, పాలడుగు ప్రభావతి, లక్ష్మీనారాయణ, పి.నర్సిరెడ్డి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

# స్వీట్ ఇస్తానని పిలిచి బాలికపై లైంగిక దాడికి యత్నం

పాత సూర్యాపేటలో ఇట్టిక బట్టీ యజమాని ఘాతుకం

ఆత్మకూర్.ఎస్, మార్చి 28 : పొట్టకూటి కోసం ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చిన బాలికపై మద్యం మత్తులో ఇటుక బట్టి యజమాని లైంగిక దాడికి యత్నించాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాత సూర్యాపేట శివారులోని వెంగమాంబ బాలాజీ హాలో బ్రిక్స్ వద్ద జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం వెంగమాంబ బాలాజీ ఇటుక బట్టి యజమాని గోగినేని వెంకటరమణ మద్యం మత్తులో తన బట్టిలో పని చేస్తున్న 15 ఏండ్ల బాలికను స్వీట్ ఇస్తానని తన రూమ్‌కు పిలిచాడు. బాలిక రూములోకి వచ్చిన వెంటనే తలుపు పెట్టి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక భయంతో బయటకు వచ్చి తన కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. కుటుంబ సభ్యులు యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ఏదో రకంగా నచ్చచెప్పేందుకు ఇటుక బట్టి యజమాని ప్రయత్నించాడు. గురువారం సాయంత్రం బాలిక తల్లి దండ్రులు ఆత్మకూర్.ఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారించాడు.

ఈ మేరకు వెంకటరమణపై పోక్సో, లేబర్ యాక్ట్, జువైనల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం ఉదయం బాధితురాలిని భరోసా సెంటర్‌కు తరలించి లైంగిక దాడి సంఘటనపై వాంగ్మూలం తీసుకొని రికార్డును న్యాయమూర్తి ముందు సమర్పించనున్నట్లు తెలిపారు. నిందితుడు వెంకటరమణను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చిన గోగినేని వెంకటరమణ వ్యాపారాల పేరుతో అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. డబ్బు, పలుకుబడితో అధికారులను మచ్చిక చేసుకొని తన తప్పులను కప్పి పుచ్చుకుంటున్నాడని విమర్శలున్నాయి.

# సబ్ కలెక్టర్ దూషించాడని మహిళ ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ, మార్చి 28 : సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద తన కార్యాలయానికి పిలిచిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తీవ్రంగా దూషించాడని ఆరోపిస్తూ ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మాడ్గులపల్లి మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన పొంతటి కొండల్‌రెడ్డి, రాములమ్మ వృద్ధ దంపతులు. తమను తమ కొడుకులు, కోడండ్లు పట్టించుకోవడం లేదని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో వారికి నోటీసులు ఇచ్చి ఆఫీసుకు పిలిపించారు. కొండల్‌రెడ్డి, రాములమ్మ, కొడుకు దామోదర్‌రెడ్డి, పున్నమ్మ సబ్ కలెక్టర్ ముందు శుక్రవారం హాజరయ్యారు. ఈ క్రమంలో తమ అత్తమామలు చెప్పిన విషయాన్ని విని తమను వివరణ అడగకుండా దూషించాడని, మహిళా పోలీసులతో కార్యాలయం నుంచి బయటకు నెట్టివేశారని పున్నమ్మ పేర్కొంది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన పున్నమ్మ మిర్యాలగూడలో గడ్డి మందు కొనుగోలు చేసి చింతలగూడెం గ్రామానికి వెళ్లి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన భర్త దామోదర్‌రెడ్డి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒక ఉన్నత స్థాయిలో ఉన్న అధికారి తనను ఇష్టం వచ్చినట్లు తిట్టాడని, దీని వల్లే తాను గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పున్నమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఈ విషయమై సబ్ కలెక్టర్‌ను వివరణ కోసం నమస్తే తెలంగాణ ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

# మామిడీలా..

## ఉగాది వస్తున్నా చెట్లపై కనిపించని కాత

- అడుగంటిన భూగర్భ జలాలతో అవస్థలు
- నీళ్లు లేక రాలిపోతున్న పిందె
- వాతావరణ మార్పులతోనూ ఇబ్బందులు
- దిగుబడులపై తీవ్ర ఆందోళనలో రైతులు

**తెలుగు నూతన సంవత్సరం ఉగాదికి ఒక్కరోజే మిగిలి ఉన్నా సూర్యాపేట జిల్లాలో ఇప్పటికీ మామిడి కాత కనిపించడం లేదు. వాతావరణ మార్పులు, అడుగంటిన భూగర్భ జలాలు, అధిక ఉష్ణోగ్రతలతో పూత, కాత ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. రెండు దశల్లోనూ రాలిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సూర్యాపేట జిల్లాలో 21 మండలాల్లో 11,600 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రధానంగా నూతనకల్, తుంగతుర్తి, చివ్వెంల, పెన్‌పహడ్, కోదాడ, గరిడేపల్లి, అర్వపల్లి మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్నారు. కాగా, అతికొద్ది చోట్ల మాత్రమే కాత కాస్త బాగుంది. అనేక చోట్ల పూత దశలోనే రాలిపోగా, పిందె దశలో విపరీతంగా నేలకు పడుతున్నది.**

– సూర్యాపేట/నూతనకల్, మార్చి 28 (నమస్తే తెలంగాణ)

ఉగాది పండుగలో మామిడి స్థానం ప్రత్యేకమైంది. ఏటా దాదాపు ఈ పండుగ నుంచే మామిడి కోతలు ప్రారంభమవుతాయి. కానీ ఈ సంవత్సరం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. సాధారణంగా ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్‌లో మామిడి పూత వస్తుంది. కానీ ఈసారి అకాల వర్షాలు, ఉష్ణోగ్రతల్లో మార్పులు, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో 70 శాతం మామిడి చెట్లకు జనవరి, ఫిబ్రవరిలో మాత్రమే పూత వచ్చింది. పైగా, పూత దశలో విపరీతంగా రాలిపోయినట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెప్తున్నారు. వేసవి ప్రారంభం నాటికి పిందెలు పెరిగి ఓ మోస్తరు కాయ సైజుకు వస్తే బాగుంటుంది. కానీ, ప్రస్తుతం మార్చి నెలాఖరుకు వచ్చినా చిన్న చిన్న పిందెలుగానే ఉంది. చాలా చోట్ల ఇంకా పూత కనిపిస్తున్నది. ప్రధానంగా జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో గోదావరి నీళ్లు రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఆ ప్రభావం వరిపై విపరీతంగా పడి దాదాపు 80శాతం పంట ఎండిపోయిన సంగతి తెలిసిందే. మామిడి తోటలపైనా అంతేస్థాయిలో తీవ్రత కనిపిస్తున్నది. ఓవైపు ఎండలు ముదురుతుండడం, మరో వైపు కరెంటు కోతలు, ఆగిఆగి పోస్తున్న బోర్లతో మామిడి పూత చెట్టు మీద నిలబడడం లేదని రైతులు వాపోతున్నారు. ఇవి చాలదన్నట్లు తేనె మంచు పురుగు వంటి చీడపీడలు సోకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడిపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.


నూతనకల్ మండలం చిల్పకుంట్లలో పూత రాలుతున్న మామిడి తోట

### మూడు బోర్లు వేస్తే రెండ్రోజుల్లో నీళ్లు పోసినయ్



మామిడి పూత పూసి కాత దశకు వచ్చే సమయంలో ఎండలు ఎక్కువవుతున్నయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరు బావులు ఎండిపోయి నీళ్లు అందడం లేదు. దాంతో చెట్లకు సరిపడా నీళ్లు లేక పూత రాలిపోయి తీవ్ర నష్టాలు వస్తున్నయి. ఈ ఏడాది పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నేను మామిడి తోటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేసిన. అవి రెండు రోజులు పోసి ఎండిపోయినయ్.

**-కొంపెల్లి రాంరెడ్డి, రైతు, చిల్పకుంట్ల గ్రామం, నూతనకల్**

### పూత రాలి పిందె పట్టడం లేదు



నాకు ఐదెకరాల్లో మామిడి తోట ఉంది. ఏటా పాదులు తవ్వించడం, మందులకు పిచికారీ చేసేందుకు అధికంగా ఖర్చు అవుతున్నది. అయినా ఫలితం ఉండడం లేదు. పూత రాలి కాత రాక తీవ్రంగా నష్టపోతున్నాం. ఎండలు పెరుగుతుండడంతో బోర్ల నుంచి నీళ్లు సరిగ్గా రాక తోటలకు అందించలేకపోతున్నాం. దాంతో పూత రాలి పిందె పట్టడం లేదు. ఈసారి నష్టం ఎక్కువ ఉండేట్టు కనిపిస్తున్నది.

**- గుగులోతు కోటేశ్‌నాయక్, రైతు మాచనపల్లి, నూతనకల్**


నీళ్లు లేక ఆత్మకూర్(ఎస్)లో నేలరాలుతున్న మామిడి కాయలు

# కట్టంగూర్ మండలంలో కరువుఛాయలు

## నీళ్లు లేక ఎండిపోతున్న పంటలు


గార్లబాయిగూడెంలో ఎండిపోయిన వరి పొలంలో మేస్తున్న గొర్రెలు

కట్టంగూర్, మార్చి 28 : యాసంగి సాగులో రైతులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. కట్టంగూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో కరువుఛాయలు తీవ్రంగా ఉన్నాయి. మండలంలో 20,400 ఎకరాల్లో వరిని సాగు చేయగా అందులో ఆయకట్టు కింద 3,650 ఎకరాలు, నాన్ ఆయకట్టు కింద 16,750 ఎకరాలు ఉన్నది. ఇస్మాయిల్‌పల్లి, మునుకుంట్ల, పిట్టంపల్లి, నారెగూడెం, ఈదులూరు, పరడ, కురుమర్తి గ్రామాల్లో గతేడాది కంటే ముందుగానే భూగర్భ జలాలు తగ్గడంతో పొట్ట దశలో ఉన్న వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి కొత్తగా బోరు బావులను 500 నుంచి 800ఫీట్ల వరకు వేసినా చుక్కనీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేటట్టు లేదని దిగులుపడుతున్నారు. ఎండి న వరి పొలాలను పశువులకు మేత గా వదిలేస్తున్న దుస్థితి నెలకొంది.

### ఎండిన వరిపొలాలన్ని చూసి కన్నీళ్లు ఆగడంలేదు



వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబం మాది. నాకు నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రెండు ఎకరాల్లో వరి, మిగతా రెండున్నర ఎకరాల్లో దొండ, గోంగూర సాగు చేసిన. భూగర్భజలాలు అడుగంటడంతో రెండు పాత బోరు బావుల్లో నీళ్లు లేక వరి పొలం, దొండ పంట ఎండిపోయింది. కళ్ల ముందే ఎండిన వరిపొలాన్ని చూసి కన్నీళ్లు ఆగడంలేదు. పంటను కాపాడుకునేందుకు 75వేల రూపాయలు పెట్టి కొత్త బోరు వేసినా చుక్కనీరు రాలేదు. ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు ఏ ఒక్క అధికారి కూడా రాలేదు. పెట్టుబడులు, బోర్లకు చేసిన అప్పులు ఎట్ల తీర్చాలో అర్థం కావడంలేదు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

**-రేకల భిక్షం, ఇస్మాయిల్‌పల్లి, కట్టంగూర్ మండలం**

# కూరగాయల రైతు కుదేలు

## నీళ్లు లేక ఎండుతున్న తోటలు

- నెల్లిబండతండాలో సగానికి సగం నష్టం
- ఎస్సారెస్పీ కాల్వకు నీళ్లు రాకపోవడంతో అవస్థలు


నెల్లిబండ తండాలో నీళ్లు లేక ఎండిన టామాట తోట

తిరుమలగిరి, మార్చి 28 : యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు సైతం ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ఎండలు విపరీతం అవుతుండడం, భూగర్భ జలాలు అడుగుంటటడంతో తోటలను కాపాడుకోలేకపోతున్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిబండతండాలో దాదాపు వంద కుటుంబాల వరకు కూరగాయలు సాగు చేస్తుంటాయి. 365 జాతీయ రహదారికి దగ్గరగా, మున్సిపాలిటీకి ఆనుకుని ఉండడంతో రైతులు నేరుగా అమ్ముకుంటారు. ఇక్కడ ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేసే రైతులూ ఉన్నారు. ఈసారి నీటి ఎద్దడి ఉంటుందని అంచనా వేసుకున్న రైతులు 60 ఎకరాల్లో కూరగాయలు చేశారు. మిగతా భూమిలో పత్తి, కంది, వేరుశనగ సాగు చేశారు. వెలిశాల వద్ద ఉన్న ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ ద్వారా 69 డీబీఎంలో నీళ్లు ప్రవహిస్తే ఈ తండాలో భూగర్భ జలాలకు ఢోకా ఉండదు. బోర్లు, బావులు పుష్కలంగా నీళ్లు అందిస్తాయి. కానీ ఈ యాసంగిలో ఎస్సారెస్పీ కాల్వకు నీళ్లు రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయడం లేదు. రెండు వారాల నుంచి బోర్లు కొద్దిగొప్ప కూడా పోయకపోవడంతో కూరగాయల తోటలు ఎండిపోతున్నాయని నెల్లిబండతండా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 30 ఎకరాల్లో తోటలు ఎండినట్లు చెప్తున్నారు. చేతికందే దశలో కూరగాయల తోటలు ఎండిపోతుండడంతో మేకలు, పశువుల మేతకు వదిలేయాల్సిన వస్తున్నదని వాపోతున్నారు. ఎకరాకు రూ.70 వేలకు అయ్యిందని వచ్చిందని ఆ పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదని చెప్తున్నారు.


నెల్లిబండ తండాలో ఎండిన మిర్చి తోట


తిరుమలగిరిలో ఎండిన నిమ్మ తోట

### కష్టం దక్కలేదు.. అప్పులే మిగిలినయ్

నేను ఎనిమిదెకరాల్లో టమాట సాగు చేసిన. ఎకరానికి 65 వేలకుపైగా పెట్టుబడి పెట్టిన. కాత బాగానే వచ్చింది. చెట్టుకు కేజీన్నర టామాటలు కాసినయి. కొంత నిలదొక్కుకుంటా అనుకునే సమయంలో 15 రోజుల నుంచి బోర్లు పోస్తలేవు. తోట మొత్తం ఎండిపోయింది. చేసేదిలేక పశువులు, మేకలను మేపుతున్నాం. చేసిన కష్టం దక్కలేదు. అప్పులే మిగిలినయ్.

**- రైతు గుగులోతు అమర్‌సింగ్, నెల్లిబండ తండా**



### బోరు పొయ్యక పంటంతా ఎండింది

నేను రెండున్నర ఎకరాల్లో టమాట సాగు చేసిన. కిందటేడు నుంచి నీళ్లు సరిగ్గ అందకపోవడంతో 40 వేల రూపాయలు పెట్టి బోరు వేయించిన. 20వేలు పెట్టి రెండు ట్యాంకులు కట్టించిన. వాటితోనైనా పైపుల ద్వారా నీళ్లు అందిద్దామంటే బోరు పోస్తలేదు. నీళ్లులేక టమాట పంటంతా ఎండిపోయింది. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టిన. ఇలా అవుతుందనుకోలేదు.

**-రైతు గుగులోతు, కిషన్‌నాయక్, నెల్లిబండతండా**





### గతంలో నీళ్లకు బాధ లేకుండే

లక్ష రూపాయల పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాల్లో టమాట సాగు చేసిన. కాల్వకు నీళ్లు రాక బోరు పొయ్యక పంటంతా ఎండిపోయింది. పశువుల మేతకు వదిలేసిన. గతంలో నీళ్లకు బాధ లేకుండే. పంటలు మంచిగ పండించుకున్నాం. ఎకరాకు 30వేల రూపాయలకు పైన మిగిలేవి. ఇప్పుడు అప్పులు మీద పడుతున్నయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

**-రైతు గుగులోతు లక్‌పతి, నెల్లిబండ తండా**

# ఎయిమ్స్‌లో స్పైన్ ఎండోస్కోపిక్ సేవలు ప్రారంభం

బీబీనగర్, మార్చి 28 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో స్పైన్ ఎండోస్కోపిక్ సేవలు ప్రారంభించారు. శుక్రవారం వెన్నముక నొప్పితో బాధపడుతున్న రోగికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డాక్టర్ సయ్యద్ ఇఫ్తేకర్, ఆర్థోపెడిక్స్ విభాగం అధిపతి డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి మాట్లాడుతూ బీబీనగర్ ఎయిమ్స్ వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సను అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు అనుగణంగా శస్త్రచికిత్సను ప్రారంభించామని తెలిపారు. ఎండోస్కోప్ సహాయంతో హెర్నియేటెడ్ డిస్కులు (స్లిప్ డిస్కులు), వెన్నెముక స్టెనోసిస్, దీర్ఘకాలిక వెన్నునొప్పి వంటి పరిస్థితులకు చిన్న కోతల ద్వారా చికిత్స చేయడానికి అనుమతిస్తుందని చెప్పారు. ఈ సాంకేతికత సాంప్రదాయ వెన్నెముక శస్త్రచికిత్సలతో పోలిస్తే ఈ శస్త్ర చికిత్స గాయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, దీని వల్ల తక్కువ రక్త నష్టం, శస్త్రచికిత్స అనంతరం రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు.


ఎయిమ్స్‌లో రోగికి సర్జరీ చేస్తున్న వైద్యులు